క్లుప్తంగా

ప్లాటినం జూబ్లీ వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం



ప్లాటినం జూబ్లీ వేడుకలకు జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 29న నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకలకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను మంగళవారం పాఠశాల పూర్వవిద్యార్థులు బైలుప్పుల షఫీవుల్లా, రిటైర్డ్ తహసీల్దార్లు అజయ్‌కుమార్, సయ్యద్‌రోషన్ అలీలు ఆహ్వానించారు. తమ ఆహ్వానానికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అదేవిధంగా డీఈఓ శామ్యూల్‌తో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులను కూడా ఆహ్వానించినట్లు వెల్లడించారు.

సేవకులకు ఘన సత్కారం



ఆల్‌ఫ్రెడ్‌రాజు, సేవకులను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడ వరద బాధితులకు పట్టణానికి చెందిన మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజును ఆయనతో పాటు మరికొందరిని మంగళవారం ఎంపీజే, ఐవైఎం నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక వీవర్స్ కాలనీలోని అలీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన సన్మాన సభలో ఆయా సంఘాల నాయకులు చాంధన్న, ముల్లా ఇస్మాయిల్ మాట్లాడారు. దాదాపు రూ.8లక్షల విలువైన నిత్యావసర సరుకులు, దుస్తులు తదితర సామగ్రిని ఆల్‌ఫ్రెడ్‌రాజు, మరికొందరు విజయవాడకు తీసుకెళ్లి వరద బాధితులకు అందజేశారని అభినందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు లాల్‌కోట్ ఖదీర్, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, దాదు, ఫయాజ్ ఉస్మాన్, నరసన్న, ప్రతిభ, ముత్తుసుమాల, అజిత్ తదితరులు పాల్గొన్నరు.

క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ-2 శోభారాణి, పీడీలు

కోసిగి: గ్రామీణ ప్రాంతాల బాలబాలికలు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈఓ-2 శోభారాణి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మంత్రాలయం నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ నరసింహులు ఆధ్వర్యంలో తాలూకా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈఓ చేతుల మీదుగా ప్రారంభించారు. పోటీల్లో కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలను నుంచి వివిధ క్రీడలకు సంబంధించి 250 క్రీడకారులు పాల్గొన్నారు. ఇందులో పీడీ రాజారామ్, వివిధ మండలాల పీఈటీలు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థినికి అభినందనలు



విజయలక్ష్మిని అభినందిస్తున్న ఎంపీ

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించిన గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన విద్యార్థిని విజయలక్ష్మిని ఎంపీ బస్తిపాటి నాగరాజు అభినందించారు. మంగళవారం పట్టణంలో విద్యార్థిని పూలబొకెతో సత్కరించి మాట్లాడారు. ఆమె చదువులకు తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు లలిత, జనార్దన్, స్థానిక ఆపిల్ ల్యాబ్ అధినేత బీరప్ప, బోడబండ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేమన శతకం పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

గోనెగండ్ల : కర్నూలు జిల్లా శ్రీ మహాయోగి వేమన భావ ప్రచార సమితి ప్రచురించిన వేమన శతకం పుస్తకాలను మండల పరిధిలోని హెచ్. కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పాఠశాల హెచ్‌ఎం మహబూబ్ బాషా మాట్లాడుతూ వేమన పద్యాలు నేర్చుకోవడం వలన విద్యార్థులకు భాషతో పాటు జీవిత సత్యాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ కుమార్, రఘు రాముడు, గట్టు తిమ్మప్ప, సంధ్య, దేవి పాల్గొన్నారు.

రోడ్డు శిథిలం ..

ప్రయాణం నరకం

- అధ్వానంగా మారిన ఎమ్మిగనూరు – కర్నూలు రహదారి
- వర్షాలకు గుంతలో నీరుచేరి మడుగులను తలపిస్తున్న వైనం
- రాత్రివేళ ప్రమాదాలు సంభవించే అవకాశం
- మరమ్మతులు చేపట్టని అధికారులు



ఎమ్మిగనూరు – కర్నూలు రహదారి దుస్థితి

ఎమ్మిగనూరురూరల్: కొంత కాలంగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిపోయింది. అధికారులు గుంతలు పడ్డ చోట తాత్కాలికంగా గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలనే ఆలోచనే చేయడంలేదు. కూటమి అధికారంలోకి వచ్చి వందరోజుల పాలనలో అభివృద్ధి చేశామనే సంబరాలు చేసుకోవడం తప్ప, రహదారులను పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వేల సంఖ్యలో వాహనాలు

కర్నూలు – ఎమ్మిగనూరు రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో బస్సులు, లారీలు, ఇతర వాహనాలు విజయవాడ, తిరుపతి, శ్రీశైలం, నంద్యాల, కర్నూలు, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్తుంటాయి. పట్టణంలోని కర్నూలు రోడ్డు పెట్రోల్‌బంక్ వద్ద పెద్ద గుంత పడటం, వర్షానికి నీరు చేరడంతో వాగును తలపిస్తోంది. ఎమ్మిగనూరు నుంచి ఎర్రకోట, రాళ్లదొడ్డి, గోనెగండ్ల వరకు రహదారి శిథిలావస్థకు చేరుకొని అధ్వానంగా మారింది. శిథిలావస్థకు చేరుకున్న రహదారిలో ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపిస్తోంది. అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ వాహనాలు కర్నూలుకు వెళ్లాలన్నా రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో సమయానికి చేరుకోలేక రోగుల ప్రాణాలకు అపాయం కలుగుతోంది. రాత్రి పూట రహదారి గూరించి తెలియని దూరప్రాంతాల వారు వేగంగా వాహనాలతో వస్తే గుంతలో పడి ప్రమాదాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తాత్కాలిక మరమ్మతులు కూడా చేయరు

రోడ్ల గుంతలు పడిన చోట తాత్కాలికంగా మట్టి, కంకర వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరచిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చాక వంద రోజుల పాలన అభివృద్ధి చేశామని చెపుతున్నారే కానీ కళ్లముందు కనిపిస్తున్న రహదారులు దుస్థితి కనిపించటం లేదని పలువురు ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న కర్నూలు రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బ్రిడ్జి, కల్వర్టులకు మరమ్మతులు ఎప్పుడో?



ఉప్పరహాల్ గ్రామం వద్ద భారీ వర్షాలకు కొట్టుకుని పోయిన బ్రిడ్జి



కౌతాళం-బదినేహాల్ గ్రామాల మధ్య కూలిపోయిన కల్వర్టు

కౌతాళం: గత నెల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పంటలు దెబ్బతినగా వివిధ రహదారుల్లో బ్రిడ్జిలు, కల్వర్టులు కూలిపోయాయి. వాటి మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం ఇప్పటి వరకు పునుకోకపోవడం విచారకరమని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కౌతాళం–ఉప్పరహాల్ మధ్యలో వంక వద్ద బ్రిడ్జి ఒక పక్కకు పూర్తిగా కొట్టుకుని పోయింది దీంతో వాహనాలు ప్రమాదకర పరిస్థితుల్లో ఈ బ్రిడ్జిని దాటాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ బ్రిడ్జిని నూతనంగా నిర్మించాలని లేదా తాత్కాలికంగా దీనిని మరమ్మతులైనా చేపట్టలని ఆయా గ్రామాల ప్రజలు రైతులు కోరుతున్నారు. ఇక కౌతాళం–బదినేహాల్ గ్రామాల మధ్య కల్వర్టు కూలిపోయింది. దీనికి మరమ్మతులు చేపట్టక పోవడంతో ఈ రహదారి వెంట వెళ్లే రైతులే కూలిపోయిన కల్వర్టును గ్రావెల్‌తో పూడ్చుకొని ప్రయాణం సాగించి తమ పనులు చేసుకుంటున్నారు. కనీసం గ్రావెల్ కూడా వేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆయా గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కూలిపోయిన బ్రిడ్జిని, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



గుంతలో వర్షపు నీరు చేరి వాగును తలపిస్తున్న కర్నూలు రహదారి

చింతలాముని, నల్లారెడ్డి స్వాములకు ప్రముఖుల పూజలు



జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డితో పాటు నాయకులను సన్మానిస్తున్న దేవాలయ పూజారులు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో వెలసిన శ్రీశ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి దశమి ఉత్సవాలు గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం దేవాలయంలో భక్తుల సమక్షంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. దశమి ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్‌లు స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ నిర్వహకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. వీరి వెంట ఎంపీపీ నసురుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, బందెనవాజ్, ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, మురళీ నాయుడు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరామ్



గోనెగండ్లలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: దళితులను అవమానిస్తూ, దళిత డాక్టర్‌పై దాడి చేసిన ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, పంతం నానాజీలను అరెస్టు చేసి శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో పవిత్రమైన రాజ్యాంగాన్ని అనుసరించి నడుచుకుంటామని ప్రమాణం చేసి, రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ చిత్రపటాన్ని చించి వేసి ఆయనను ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అవమానపరిచాడన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ సీనియర్ దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావును తీవ్రమైన అసభ్య పదజాలంతో దూషించి, దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీపై చర్యలు తీసుకోవాలన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అడ్వైజర్ చంద్రయ్య, మాల మహానాడు ఆదోని డివిజన్ అధ్యక్షుడు యల్లప్ప, ఆదోని పట్టణాధ్యక్షుడు బొబ్బిలి దాసరి నరేష్‌కుమార్, భరత్, తలారి లక్ష్మన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల : అంబేడ్కర్ చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీని చించివేసిన ఉండి ఎమ్మెల్యే రాఘురామకృష్ణం రాజును, దళిత డాక్టర్‌పై దాడి చేసి అవమాన పరచిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. మ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్, నాయకులు ప్రభు, శిఖామణి, నాగేష్, బతకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఫిర్యాదు



ఎమ్మిగనూరు పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. గ్లోబల్ రిపబ్లిక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సప్ప, భారత ప్రగతిశీల యువజన సంఘ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు చార్లెస్, ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకుడు రంగన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, స్థానిక నాయకులు ప్రసన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సుదర్శన్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి, వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. అంతకు మునుపు వైఎస్సార్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి సోమప్ప సర్కిల్‌లో ఎమ్మెల్యే రఘురామ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రోటరీ క్లబ్



రోటరీక్లబ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ గవర్నర్ సాదు

ఎమ్మిగనూరుటౌన్: రోటరీ క్లబ్ ద్వారా ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ గవర్నర్ సాదు తెలిపారు. పట్టణంలోని అయ్యప్పస్వామి కాంప్లెక్స్‌లో రోటరీ క్లబ్ కార్యాలయాన్ని క్లబ్ అధ్యక్షుడు కేఆర్ నట్‌రాజ్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు పద్మనాభరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థినీవిద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కేఆర్ నరసింహారెడ్డి, సుధాకర్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్, మాచాని వెంకటేష్, షఫీవుల్లా, బీరప్ప, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం పురపాలక చైర్మన్ బి.శాంతి, డిప్యూటీ ఈఓ వెంకటరమణా రెడ్డి పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా చాల అవసరమని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడమే కాకుండా మనిషిని ఆరోగ్యంగా కూడా ఉంచుతుందన్నారు. పోటీలలో నియోజకవర్గంలోని 20 పాఠశాలలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసులు, స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్లు నరసయ్య, రామన్న, హెచ్‌ఎంలు మల్లికార్జున, ఆలీమ్ సిద్ధిఖీ, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కేవీకేలో మిరప రైతులకు శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26వ తేదీన మిరప పంట సాగు చేసే రైతులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఫోర్జరీ సంతకాలు చేసి మంజూరు చేస్తూ డబ్బు వసూలు చేస్తున్న వీఆర్వో సూర్యనారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదోని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎరుకల రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వీసూర్యనారాయణరెడ్డి కౌతాళం మండలంలోని బదినేహాల్ గ్రామ వీఆర్వోగా పనిచేసే సమయంలో ఎస్సీ కమ్యూనిటీకి చెందిన నల్లగోడి శ్రీనివాసులు అనే పేరుగల ఎస్‌జీటీ టీచర్‌కు ఎరుకల కుల (ఎస్టీ) ధ్రువీకరణ పత్రం మంజూరు చేయించాడన్నారు. ఇప్పుడు అతడిని ఆదోని మండలానికి బదిలీ చేశారన్నారు. వెంటనే సదరు వీఆర్వో బదిలీ ఉత్తర్వులను ఆపాలని కోరారు.

27న జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా మంగళవారం తెలిపారు. ఈజాబ్ మేళాలో నవభారత్ ఫర్టిలైజర్స్, వికాస్, అరబిందో ఫార్మా, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కంపెనీల్లో 250లకు పైగా ఖాళీలు వున్నాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ, బీటెక్, ఐటీఐ విద్యార్హతలున్న వారు జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



హెచ్‌బీఎస్ కాలనీలో ర్యాలీ, పారిశుధ్య పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ వాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని మున్సిపల్ డీఈఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సూచించారు. స్వచ్ఛహిత సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో పారిశుద్ధ్యంపై ర్యాలీని మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేపట్టారు. ఇందులో భాగంగా పారిశుధ్య పనులు చేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం జయవర్ధన్, శానిటరీ, పర్యావరణ సిబ్బంది పాల్గొన్నారు.

చీపురు పట్టిన మున్సిపల్ కమిషనర్



పాత బస్టాండు సర్కిల్‌లో రోడ్డును శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఉద్యోగులు

ఆదోని టౌన్: మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ శానిటేషన్ అధికారులతో కలిసి చీపురు పట్టి వీధులను శుభ్రం చేశారు. వెంకన్నపేట వీధిలో మున్సిపల్ కమిషనర్ రోడ్లపై కసువు ఊడ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

స్వామిని అడ్డుపెట్టుకొని చంద్రబాబు రాజకీయాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

గోనెగండ్ల : ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందినటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామిని అడ్డుపెట్టుకొని సీఎం చంద్రబాబు నాయుడు రాజకీయాలు చేస్తున్నారని, రాజకీయాల కోసమే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. రుద్రగౌడ్, బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే విషప్రచారం చేస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే లడ్డూలో కల్తీ జరిగిందని, ఆయన నియమించిన ఈఓ శ్యామల రావుపై కేసు పెట్టి జైలు పంపించాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్న బాబుకు దేవుడు తొందర్లోనే గుణపాఠం చెబుతాడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టీ.నసురుద్దీన్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, బందెనవాజ్, శ్రీరామ్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, అల్లాబా, గోవిందు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చినందుకే ఆరోపణలు



మాట్లాడుతున్న బాధితుడు పులుసు రాజు

కోసిగి: స్థానిక జగనన్న కాలనీలో స్థలాలు ఆక్రమించుకున్నాడంటూ టీడీపీ మండల నాయకులు తనపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని మండల కేంద్రానికి చెందిన పులుసు రాజు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడుగా పనిచేసినందుకు తన పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీ స్థలం ఆక్రమించలేదని చెప్పేందుకు వెళ్తే తనపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈవిషయం పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పైగా నా పై తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాలు ఆక్రమించిన వారి పై పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుని తండ్రి పులుసు ఈరన్న, సోదరుడు నారాయణ ఉన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన



టిడ్కో గృహాల లబ్ధిదారుల పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, చిత్రంలో సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని సిరుగుప్ప రోడ్డు సమీపంలో ఉన్న టిడ్కో గృహాలను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి.. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ ఎమ్మెల్యే లబ్ధిదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో ఉన్న ప్రజలకు తాగునీరు, విద్యుత్, రోడ్ల సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని మండిగిరి పంచాయతీ పరిధిలోని గృహ నిర్మాణ సముదాయాన్ని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. నిర్ణీత గడువులోపు నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శాంత, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివరాముడు, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టిడ్కో ఇంజినీర్స్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ

ఆదోని రూరల్: ఆదోని పౌర సరఫరాల గోదామును మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ నిల్వ, రికార్డుల వివరాలు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, సివిల్‌సప్లై డీటీ వలీబాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

కోసిగి: ప్రతి రైతు పంట నమోదు, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయధికారి రాజు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వందగల్లు, జుమ్మాలదిన్నె గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి, పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో రైతుల పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు రాజేంద్ర, లక్ష్మీశ్వరి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండల పరిధిలోని అలువాల, పెద్దనేలటూర్ గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి హేమలత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో ఏఓ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త కే.మౌనిక మాట్లాడుతూ.. మిరపలో తామర పురుగు నివారణకు నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న అధ్యక్షతన ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమమాల్లో కూడా ముందు ఉండాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు కళాశాల అవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేదవతి, చిట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.